క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



నర్శిపేటలో మృతురాలి కుటుంబానికి బీమా మంజూరు పత్రం అందజేస్తున్న నాయకులు

తొండంగి: మండలంలోని దానవాయిపేట పంచాయతీ నర్శిపేట గ్రామానికి చెందిన పోలవరపు నాగమణి గత మే నెలలో విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా రూ.5 లక్షలు మంజూరైంది. కాగా గురువారం వైఎస్సార్ సీపీ నాయకుడు మడదా హేమంత్, పంచాయతీ కార్యదర్శి రాజబాబు మృతురాలి కుమారుడు పోలవరపు అర్జున్‌కు బీమా మంజూరు పత్రాలను అందజేశారు. బీమా నగదు రూ.5 లక్షలు అర్జున్ బ్యాంకు ఖాతాలో జమైనట్టు పంచాయతీ కార్యదర్శి రాజబాబు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ రాయుడు బాల నర్సయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డును అండర్‌పాస్‌కు అనుసంధానం చేయాలి

తుని: పట్టణంలోని రెండో వార్డులో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును రైల్వే అండర్‌పాస్‌కు అనుసంధానం చేయాలని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన రైల్వే డీఈ, మున్సిపల్ డీఈలతో చర్చించారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కొండవారిపేట రైల్వే తూము అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రెండో వార్డు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పనులకు సంబంధించి మంత్రి దాడిశెట్టి రాజా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరవరపుపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కోర్టు వీధి, బ్యాంక్ కాలనీ, మార్కెట్ యార్డు, బత్తాయితోట, సమితి ఆఫీసు వీధి, దుర్గాదాస్ వీధి, రెడ్‌కాన్వెంట్ వీధి, స్వప్న లాడ్జి వీధి, కొత్తపేట, శాంతి నగర్, సినిమా రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

తొండంగి: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. మండలంలోని కొమ్మనాపల్లి, సీతారాంపురం, రావికంపాడు ఫీడర్లలో విద్యుత్‌లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతుల పనులు నిర్వహిస్తున్నామన్నారు. కోదాడ, కొమ్మనాపల్లి, సీతారాంపురం తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

విత్తన ఎంపిక ఎంతో కీలకం

గండేపల్లి: పంటల సాగులో విత్తన ఎంపిక ఎంతో కీలకమని మండల వ్యవసాయాధికారి పి. సద్గురుమూర్తి సూచించారు. మండలంలోని సింగరంపాలెంలో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు ఉపయోగిస్తే ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. నాట్లకు ముందు రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. వీఏఏ ఉదయ్ కిరణ్, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

పుష్కర లిఫ్టుకు మరమ్మతులు చేయాలి

జగ్గంపేట: పుష్కర ఎత్తిపోతల పథకంలోని తాళ్లూరు లిఫ్టుకు అనుసంధానంగా ఉండే రాజపూడి లిఫ్ట్‌కు తక్షణమే మరమ్మతులు చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ కోరారు. జగ్గంపేట మండలం రాజపూడిలో పుష్కర ఎత్తిపోతల పథకం లిఫ్టును గురువారం ఆయన పరిశీలించారు. రాజపూడిలోని పుష్కర లిఫ్టు ద్వారా రైతుల పొలాలకు నీరు అందేదన్నారు. ప్రస్తుతం తాళ్లూరు,రాజపూడి లిఫ్టులకు మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

రౌతులపూడి: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ కోరారు. స్థానిక విజేత జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం ×వారధి× కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న సైబర్ నేరాలు, గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా, పేకాట, గుండాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పాడిపంటలతోనే దేశాభివృద్ధి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- పలు గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ప్రారంభం



కేపీ మల్లవరం సదస్సులో మాట్లాడుతున్న డీపీఓ విక్టర్



శంఖవరంలో పాల వెల్లువ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: పాడి పంటలతోనే దేశాభివృద్ధి సాధ్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని శంఖవరం, కొంతంగి, నెల్లిపూడి, మండపం, కత్తిపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. అమూల్ డెయిరీ ద్వారా పాల సేకరణ పాడి రైతులకు ఎంతో లాభసాటి అన్నారు. రైతులు జగనన్న పాలవెల్లువను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, మండల పశువైద్యాధికారి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

కోటనందూరు: మహిళా రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ పథకాన్ని అమలు చేస్తుందని జిల్లా పంచాయతీ అధికారి, పాలవెల్లువ మండల ప్రత్యేకాధికారి రోలకంటి విక్టర్ అన్నారు. మండలంలో కేఈ చిన్నయ్యపాలెం, పాతకొట్టాం, కేపీ మల్లవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పాలవెల్లువ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం కేపీ మల్లవరంలో మహిళా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు మహిళా రైతులే యజమానులన్నారు. కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తే ఎక్కువ ఆర్థిక ప్రయోజనం కలుగుతుందన్నారు. జగన్నాథపురం, ఇందుగపల్లి గ్రామాల్లో పాలవెల్లువ కేంద్రాలను పశుసంవర్ధకశాఖ ఏడీ వి.శ్రీధర్ పరిశీలించారు. మండలంలో ప్రారంభించిన 14 పాలవెల్లువ కేంద్రాలను ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, వెటర్నరీ డాక్టర్లు శ్రీధర్, రత్నతేజ, ఏఈఓ కేవీ శివకుమారి తనిఖీ చేశారు.



పారుపాకలో జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మి

జగనన్న పాలవెల్లువ కేంద్రాలు ప్రారంభం

రౌతులపూడి: పాడి రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న పాల వెల్లువ కేంద్రాలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలోని 13 స్వయం చాలక పాల కేంద్రాలు మరో అనుబంధ చాలక పాలకేంద్రంతో కలసి 14 కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్‌ను (ఏఎంసీయూ)ను స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని 17 సచివాలయాలు ఉండగా వీటిలో ములగపూడి, రాజవరం, ఎస్ఎన్ పట్నం, లచ్చిరెడ్డిపాలెం, ఎ.మల్లవరం, బలరామపురం, ఎస్.పైడిపాల, రౌతులపూడి-1, గిడజాం, ఎస్.అగ్రహారం, పారుపాక, పి.చామవరం, శృంగవరం, బంగారయ్యపేట గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పశుసంవర్ధకశాఖ అధికారి డా.ముద్రగడ వీర్రాఘవరావు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

తుని రూరల్: మండలంలోని కేఓ మల్లవరం, ఎస్.సూరవరం, టి.వెంకటాపురం, దొండవాక, రాపాక, డి.పోలవరం, చామవరం తదితర గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రారంభించారు. తుని మండలంలో 19 గ్రామాల నుంచి తొలిరోజు 220 లీటర్ల పాలు సేకరించినట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. సర్పంచులు డొంక సత్యవతి, చింతంనీడి కృష్ణ, గూడుపు గౌరీకుమారి, లంక సత్యవతి, ఎంపీటీసీ సభ్యుడు శెట్టి శ్రీనివాసరావు, తహసీల్దార్ శివకుమార్ పాల్గొన్నారు.

పాలవెల్లువ కేంద్రాలను పరిశీలించిన జేసీ

తొండంగి: మండలంలోని తొండంగి, ఎ.కొత్తపల్లి గ్రామాల్లోని జగనన్న పాలవెల్లువ కేంద్రాలను గురువారం జాయింట్ కలెక్టర్ ఇలక్కియ పరిశీలించారు. ఎ.కొత్తపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న పాలవెల్లువ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ప్రయోజనాలను రైతులకు వివరించారు. తొండంగిలో పాలవెల్లువ కేంద్రాన్ని పరిశీలించి రికార్డుల నిర్వహణ, కేంద్రం పనితీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసపులేటి సతీష్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

17 సచివాలయాల్లో పాలవెల్లువ ప్రారంభం

మండలంలోని 17 గ్రామ సచివాలయాల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ప్రారంభించినట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ గురువారం తెలిపారు. గోపాలపట్నంలో సర్పంచ్ కటకం శివ జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని ప్రారంభించారు. తొండంగి, రావికంపాడు, ఎ.కొత్తపల్లి, బెండపూడి, పీఈ చిన్నాయపాలెం, సీతారాంపురం, శృంగవృక్షం, కోదాడ తదితర గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు జగనన్న పాల వెల్లువ కేంద్రాలను ప్రారంభించారు.



ఎ.కొత్తపల్లిలో జగనన్న పాలవెల్లువ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియ

కేఈ చిన్నయ్యపాలెంలో కేంద్ర బృందం పర్యటన

కోటనందూరు: మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా గురువారం కేంద్ర బృందం పర్యటించింది. బృంద సభ్యులు ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణలో పంచాయతీ అధికారుల తీరు, వ్యక్తిగత ఆరోగ్యం పరంగా తీసుకునే జాగ్రత్తలు తదితర వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సందర్శించి గ్రీన్ అంబాసిడార్లతో మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కేఈ చిన్నయ్యపాలెంలో పారిశుద్ధ్యంపై మహిళను ఆరా తీస్తున్న కేంద్ర బృందం

స్వాతంత్య్ర వేడుకలకు దళితులు దూరం

తుని: మణిపూర్‌లో గిరిజనులు, దళితులు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు నిరసనగా ఈ నెల 15న జరిగే స్వాతంత్య్ర వేడుకలకు దళితులు దూరంగా ఉంటామని దళిత బహుజన పార్టీ(డీబీపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. తుని – పాయకరావుపేట పరివర్తన కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో దళిత, క్రిస్టియన్ జాతులకు నేటికీ స్వాతంత్య్రం, స్వేచ్ఛ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా అగ్రకులాల ఆధిపత్యంలో దళితులు బానిసలుగానే బతుకుతున్నారన్నారు. దేశంలో ఇంత దారుణమైన పరిస్థితులున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు దువ్వాడ దావీద్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గారా విజయబాబు, నాయకులు జెక్కల సూరిబాబు, చిరుకూరి అర్జునరావు, మార్ని సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి



అధికారులు, ప్రజాప్రతినిధుల రివ్యూ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- రాజుపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని రాజుపాలెంలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ కిర్లంపూడి మండలంలోని 15 గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న పాలవెల్లువ కేంద్రాలతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, సర్పంచ్ గొడే పద్మావతి, జోకా శ్రీను, తోట గాంధీ, గణేశుల లచ్చబాబు, జగనపరెడ్డి బాబు, చదలవాడ బాబీ, తోట విష్ణు, అల్లు విజయకుమార్, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణను అడ్డుకున్న అధికారులు

సాక్షి ఇంపాక్ట్

గండేపల్లి: నీలాద్రిరావుపేటలోని సూరయ్య చెరువు భూమి ఆక్రమణను గురువారం అధికారులు అడ్డుకున్నారు. సర్వే నంబర్ 120లోని సుమారు నాలుగు ఎకరాల చెరువు భూమిలో కొందరు తుప్పలు తొలగించి సరిహద్దు రాళ్లు వేశారు. దీనిపై ×సూరయ్య చెరువు ఆక్రమణకు యత్నం× అనే శీర్షికతో ఇటీవల ×సాక్షి×లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన తహసీల్దార్ వీవీ సత్యనారాయణ, ఇరిగేషన్ ఇన్‌చార్జ్ జేఈ పి.వీరబాబు, లస్కర్స్ సీహెచ్ శేఖర్, నాగేంద్ర, సురేష్, వీఆర్వో దిలీప్, పంచాయతీ కార్యదర్శి తరంగిణి, తదితరులు గురువారం ఆక్రమణకు గురైన భూమిని పరిశీలించారు. భూమిలో వేసిన సరిహద్దు రాళ్లను తొలగించి వాటిని బయటకు తరలించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకునే ప్రయత్నం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.




సూరయ్య చెరువు భూమిలో వేసిన సరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

జగనన్న సురక్షతో ప్రతిఒక్కరికీ మేలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలందరికీ మేలు జరిగిందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. గురువారం ఆయన తన స్వగ్రామంలో శంఖవరంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన కుల ధ్రువీకరణ, జనన, మరణ, ఆదాయ తదితర 11 రకాలు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 40517 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్టు తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ తమ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ పర్వత రాజబాబు, శంఖవరం మండలం పార్టీ జేసీఎస్ ఇన్‌చార్జి బుర్ర లచ్చబాబు, ప్రత్తిపాడు మండలం ఇన్‌చార్జి రామిశెట్టి చిన్నబాబు, రౌతులపూడి మండలం ఇన్‌చార్జి రాంకూర్తి బాబ్జి, ఏలేశ్వరం మండలం ఇన్‌చార్జి సామంతుల చిన్నరావు, ఏలేశ్వరం నగర పంచాయతీ ఇన్‌చార్జ్ అలమండ స్వామి తదితరులు పాల్గొన్నారు.



శంఖవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

సప్తాహ ప్రవచనాలు ప్రారంభం

కిర్లంపూడి: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గురువారం కోగంటి వేంకట శ్రీరంగనాయకి శ్రీమహాద్భాగవత సప్తాహ ప్రవచనాలు ప్రారంభించారు. ఆలయంలో సప్తాహ ప్రవచనాల మహాయజ్ఞం ఈ నెల 10వ తేదీ వరకూ కొనసాగుతుందని వాసవీ ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు తెలిపారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే ధ్యేయం



ప్రత్తిపాడులో గర్భిణికి పోషకాహార కిట్టు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



జగపతినగరంలో లబ్ధిదారులకు సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న నాయకులు

ప్రత్తిపాడు: గర్భిణులు, బాలింతల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ ఆవరణలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. గతంలో పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లేందుకు గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడేవారని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. నేరుగా లబ్ధిదారుల ఇంటికే పౌష్టికాహారం అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంటేశ్వరరావు, కౌన్సిలర్ అలమండ చలమయ్య, సొసైటీ చైర్మన్లు గొంతిన సురేష్, చెక్కపల్లి సత్తిబాబు, చిక్కాల లక్ష్మణరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆర్‌వీఎస్ లక్ష్మి, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక లయన్స్‌క్లబ్ ఆవరణలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ గర్భిణులకు పసుపు, కుంకుమ, పండ్లతో సీమంతం చేశారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే పురుడు పోసుకోవాలన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

తుని: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ త్రిపర్న ఆదిలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవజాత శిశువుకు 6 నెలల పాటు తల్లిపాలను పట్టే సంస్కృతిని ప్రోత్సహించాలన్నారు. తల్లిపాలలో పిండి పదార్థాలు, విటమిన్లు అధికంగా ఉండి బిడ్డ ఎదుగుదలకు, మెదడు అభివృద్ధికి సహాయపడతాయన్నారు. అనంతరం బాలింతలు, గర్భిణులకు టేక్ హెం రేషన్ కిట్లను పంపిణీ చేశారు.



రాజపూడిలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించిన అధికారులు

కిర్లంపూడి: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.అన్నపూర్ణ అన్నారు. జగపతినగరం పంచాయతీలో గురువారం సీడీపీఓ అన్నపూర్ణ అధ్యక్షతన గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు. సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. మండల పరిధిలో 383 మంది గర్భిణులు, 336 బాలింతలు వెరసి మొత్తం 719 మంది లబ్ధిదారులకు సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తామని సీడీపీఓ అన్నపూర్ణ తెలిపారు.



తునిలో గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఆదిలక్ష్మి

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

జగ్గంపేట: మండలంలో రాజపూడి అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు టేక్ హోమ్ రేషన్ పంపిణీని గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమ్మాజీ ప్రారంభించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బూసాల విష్ణుమూర్తి, పంచాయతీ సెక్రటరీ నర్శింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని మల్లవరంలో గర్భిణులు, బాలింతలకు గురువారం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వీటిని అందజేశారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ ఐ.అర్జునరావు, వైస్ ఎంపీపీ గోకాడ చిట్టిబాబు పాల్గొన్నారు.

జగనన్న సోషల్ మీడియా సభ్యులకు సర్టిఫికెట్లు



ఇర్రిపాకలో సోషల్ మీడియా సభ్యులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: టీమ్ జగనన్న సోషల్ మీడియాలో టాప్ 5లో నిలిచిన సభ్యులను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గురువారం ప్రశంసించారు. జగనన్న సోషల్ మీడియాలో టాప్ 5లో నిలిచిన ఒమ్మి నాగేంద్ర ప్రసాద్, మేడిశెట్టి సత్యనారాయణ, పాపికొండ రమణ, పండూరి చినబాబు, కాపారపు రాజేష్‌లకు ఇర్రిపాకలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు



తునిలో సీసీ డ్రైన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఏలూరి బాలు

తుని: పట్టణంలో మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ యువత అధ్యక్షుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు అన్నారు. స్థానిక 20, 21 వార్డుల్లో రూ.15 లక్షలతో నిర్మించే సీసీ డ్రైన్లకు గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ తుని పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, ఎస్సీ సెల్ కన్వీనర్ బోడపాటి శ్రీను, కౌన్సిలర్ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

కిర్లంపూడి: ఎడ్యుకేషన్ సర్వే ద్వారా 5–18 సంవత్సరాలు కలిగిన విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశపు హాలులో గురువారం సంక్షేమ విద్యా సహాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ నూరు శాతం చదువుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. వలంటీర్లు, సంక్షేమ విద్యా సహాయకులతో గ్రామాల్లో సర్వే నిర్వహించి బడి ఈడు పిల్లలను బడుల్లో చేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు టి.జోసెఫ్, ఎం. చిన్నారావు పాల్గొన్నారు.